సాక్షి తిరుపతి

సోమవారం । 5 । మే । 2025



డిగ్రీ పరీక్ష సెంటర్ల మార్పుతో అవస్థలు

డిగ్రీ పరీక్ష కేంద్రాలను ముందస్తుగా విద్యార్థులకు సమాచారం లేకుండా మార్పు చేయడంతో ఇబ్బందులు పడ్డారు. - 8లో



ఆహ్లాదమా నీవెక్కడ?

రూ. లక్షలు వెచ్చించిన తిరుమల నగర్ తుడా ఉద్యానవనం నిర్వహణ లేకపోవడంతో అధ్వాన్నంగా మారింది. - 8లో



నీట్..ప్రశాంతం

జిల్లాలో మొత్తం పది పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన నీట్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. - 8లో

న్యూస్‌రీల్

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ నరసింహులు

తిరుపతి అర్బన్ : లక్ష్య నిర్దేశం.. చిత్తశుద్ధితో చేసే ఏ పని అయినా విజయం సాధించవచ్చని, దివి నుంచి భువికి గంగను తెచ్చిన భగీరథ మహర్షి పట్టుదల అసామాన్యమని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ నరసింహులు ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహాయ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోత్స్న, లక్ష్మీనారాయణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పీజీసెట్ దరఖాస్తుల స్వీకరణ

తిరుపతి సిటీ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 వర్సిటీలలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏపీ పీజీ సెట్-2025 పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ సోమవారంతో ముగియనుంది. రూ.1000 ఫైన్‌తో ఈనెల 15 వరకు చివరి గడువుగా అధికారులు నిర్ణయించారు. పీజీ సెట్ పరీక్ష జూన్ 9వ తేదీ నుంచి నిర్వహించనున్నారు.

ఐసెట్ హాల్ టికెట్లు విడుదల

తిరుపతి సిటీ: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల కోసం ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఐసెట్-2025 హాల్ టికెట్లను ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబర్, హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని అధికారులు వెల్లడించారు. ఈనెల 7వ తేదీన ఐసెట్-2025 పరీక్ష నిర్వహించనున్నారు.



కరకంబాడి సమీపంలో మట్టి అక్రమ తవ్వకాలు



కొండలుగొట్టి.. కోట్లు పట్టి

కొండలను నేలమట్టం చేసి ప్రకృతి సంపదను విధ్వంసం చేస్తున్న తెలుగు తమ్ముళ్ల ఆగడాలకు అంతే లేకుండా పోయింది. తిరుపతికి కూతవేటు దూరంలో కరకంబాడి సమీపంలోని శేషాచల కొండలను పిండి చేస్తూ..యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు చేస్తూ దర్జాగా దోపిడీ చేస్తున్నా అడిగే అధికారే కరువయ్యారు..బళ్లారి గనులకు మించి కొండలను విధ్వంసం చేస్తూ..అక్రమంగా రూ.కోట్లు దోచేస్తున్నారు. నేతలు ఇచ్చే కాసులకు కక్కుర్తిపడి ప్రకృతి సంపదను పబ్లిక్‌గా లూటీ చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఈ విచ్చలవిడి దోపిడీకి అడ్డు పడకపోతే శేషాచల కొండలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది.

- వందల ట్రిప్పుల మట్టి అక్రమ రవాణా
- కొండలే కనుమరుగయ్యే ప్రమాదం
- రూ.కోట్లు దోచేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- మామూళ్ల మత్తులో అధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తెలుగు తమ్ముళ్ల ఇక మనకు అడ్డేముంది అనుకున్నారో ఏమో కానీ యథేచ్ఛగా రాత్రీపగలు అనే తేడా లేకుండా మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. కొండలను సైతం నేలమట్టం చేస్తూ రూ. కోట్లు గడిస్తున్నారు. ఇదంతా ఎక్కడో మారుమూల ప్రాంతంలో అనుకుంటే పొరపాటే తిరుపతికి 10 కిలోమీటర్ల దూరంలో తిరుపతి-కడప రహదారి పక్కనే మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

అధికారుల అండదండలు

తిరుపతి- కడప ప్రధాన రహదారి పక్కనే ఇంత జరుగుతున్నా అధికారులు తమకేమీ సంబంధం లేదు అనే విధంగా వ్యవహరిస్తున్నారు. అప్పుడప్పుడూ నామమాత్రంగా మైనింగ్ అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చి దాడులు చేస్తారు. అక్కడ ఎటువంటి అక్రమ రవాణా జరగడం లేదంటూ ఉన్నతాధికారులను తప్పుదారి పట్టిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ తమ దందాను కొనసాగిస్తున్నారు. రెవెన్యూ, పోలీసులు, మైనింగ్ అధికారుల అండదండలతో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి.

ట్రెంచ్‌ను పూడ్చి.. దర్జాగా దోపిడీ



ట్రెంచ్‌ను పూడ్చి దారి వేసుకున్న ప్రదేశం

మట్టి అక్రమ రవాణాపై వస్తున్న విమర్శలకు ఏదో ఒకటి చేద్దామని అధికారులు కొండ వద్దకు వెళ్లే దారిలో వాహనాలు వెళ్లకుండా ట్రెంచ్ తవ్వారు. తవ్విన ట్రెంచ్‌ను పూడ్చివేసి యథేచ్ఛగా అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. పర్యవేక్షణ లోపం వల్లే ఇదంతా జరుగుతోంది. ట్రిప్‌కు ఎంత అని అధికారులకు ఇస్తున్నాం.. ఇక మమ్మల్ని అడిగేది ఎవరు అనే రీతిలో అక్రమ రవాణా సాగిస్తున్నారు. అక్రమ రవాణా జరుగుతున్న ప్రదేశానికి కొంత దూరంలోనే పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఉన్న కూడా మాకు మట్టి అక్రమ రవాణాకు సంబంధం లేదన్నట్లు కళ్లు మూసుకొని పర్యవేక్షణ చేయడం విమర్శలకు తావిస్తోంది.

మైనింగ్‌లో బళ్లారిని మించి..

మైనింగ్ పేరు చెప్తే అందరికీ బళ్లారి గుర్తుకొస్తుంది. కానీ అంతకు మించి తవ్వకాలు తిరుపతి సమీపంలో జరుగుతూ ఉన్నాయంటే ఎవరూ నమ్మరు. ఇప్పటికే మూడు కొండలను నేలమట్టం చేశారు. ఆ ప్రాంతానికి వెళ్లాలంటే ఒకటే దారి.. ఆ దారిలో వెళ్లాలంటే ప్రాణభయంతోనే వెళ్లాలి, ఎక్కడ మనపైకి టిప్పర్లు ఎక్కిచ్చేస్తాయేమో అనే భయం భయంగా అడుగులు వేయాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ప్రధాన రహదారిపై తమ అనుచరులను కాపలాగా ఉంచి లోపలికి ఎవరినీ వెళ్లనీయకుండా కాపు కాస్తున్నారు.

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పర్యవేక్షణలోనే..

అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ ముఖ్య నేత పేరు చెప్పుకొని స్థానిక టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పర్యవేక్షణలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి అనేది జగమెరిగిన సత్యం. అందువల్లే అధికారులు తమకు ఎందుకులే అని మామూళ్లు తీసుకొని మత్తులో జోగుతున్నారు. ఇదే అవకాశంగా భావించి పట్టపగలు, అర్ధరాత్రి అనే తేడా లేకుండా కొండలను గుల్ల చేస్తున్నారు. ఒక టిప్పర్ 7 వేల నుంచి ఎనిమిది వేల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. అలా రోజుకు సుమారు 200 ట్రిప్పులు వరకు అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే కొండలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ముఖ్యనేత పేరుచెప్పి దోచేస్తూ..

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలో శేషాచల అడవికి ఆనుకొని ఉన్న రెవెన్యూకు చెందిన కొండలను అధికార పార్టీకి చెందిన నియోజకవర్గ ముఖ్యనేత పేరు చెప్పుకొని స్థానిక తెలుగు తమ్ముళ్లు కొల్లగొడుతున్నారు. కొండలను సైతం కనుమరుగు చేస్తూ కోట్లు దండుకుంటున్నారు. నాలుగు హిటాచీలు పదుల సంఖ్యలో టిప్పర్లు రోజూ వందల ట్రిప్పులు అక్రమంగా మట్టి రవాణా సాగిస్తున్నాయి. తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి పరిసరాల్లోని లే అవుట్‌లు, వెంచర్లకు మట్టిని తోలుతున్నారు.



రాత్రి సమయంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు

వాహనదారుల ఇక్కట్లు

అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లు ప్రధాన రహదారిపై దుమ్మును లేపుతూ దర్జాగా వెళ్తున్నారు.కడప-తిరుపతి ప్రధాన రహదారిపై దుమ్ము నిండిపోవడంతో ఆ ప్రాంతంలో వాహనాలు నడిపేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టిప్పర్ నిండుగా మట్టి వేసుకోవడంతో గాలికి ఎగిరి రోడ్డుపై వచ్చే వాహనాలపై మట్టి పడటంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.



టిప్పర్లలో మట్టి అక్రమ రవాణా



తిరుపతి- కడప ప్రధాన రహదారిలో మట్టి టిప్పర్ వెళ్లడంతో ఎగజిమ్ముతున్న దుమ్ము



మట్టి తవ్వగా ఏర్పడిన గుంతలు

జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది.. మండు వేసవిలో రెండు గంటల పాటు తిరుపతిలో కుండపోత వర్షం కురిసింది. జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం అక్కడక్కడా కురిసింది. ఈ నేపథ్యంలో పిడుగు పాటుకు జిల్లాలో నలుగురు దుర్మరణం చెందారు. పలుచోట్ల చెట్లు విరిగిపడి వాహనాలపై పడి ధ్వంసం కాగా మరికొన్నిచోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. కొన్నిరోజులుగా ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అయిన జనానికి ఈ వర్షం ఉపశమనం కలిగించింది.



తడి చెత్త వ్యర్థాలను తరలించే కాంప్యాక్టర్ వాహనంపై విరిగిపడ్డ భారీ వృక్షం

గాలీవాన బీభత్సం

- పెనుగాలుల హోరు
- బెంబేలెత్తిన జనం
- 2 గంటల పాటు కుండపోత వర్షం
- నేలకొరిగిన భారీ వృక్షాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పిడుగుపాటుతో నలుగురి మృతి



తిరుపతిలో చెట్టు విరిగిపడి ధ్వంసమైన కారు



మారుతీ ఆసుపత్రి పక్కన కారుపై పడిన చెట్టు



కోట: తహసీల్దార్ ఆఫీస్‌కు వెళ్లే మార్గంలో కూలిన చెట్టు

తిరుపతి తుడా : అకస్మాత్తుగా గాలీవాన బీభత్సం సృష్టించింది. రెండు గంటల పాటు కుండపోత వర్షంతో తిరుపతి నగరం తడిసి ముద్దయింది. వడగళ్ల వానతో జనం బెంబేలెత్తిపోయారు. గాలి బీభత్సానికి చెట్లు నేలకొరిగాయి. తిరుపతి నగరంలో ఆదివారం మధ్యాహ్నం 1.30 నిమిషాలకు ప్రారంభమైన వర్షం సుమారు 2 గంటల పాటు కొనసాగింది. కొన్నిరోజులుగా వేసవి తాపానికి జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ క్రమంలో కుండపోత వర్షం పడడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

వినాయక విగ్రహాలు ధ్వంసం

తిరుపతి మంగళం : తిరుపతి అర్బన్ మండలం మంగళం పరిధిలో ఆదివారం కురిసిన గాలీవానకు బొమ్మల క్వార్టర్స్‌లో కె.లలితకు చెందిన భారీ షెడ్డు కూలిపోయింది. షెడ్డు లోపల తయారీలో ఉన్న 40 పెద్ద వినాయక విగ్రహాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. తిరుమలనగర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుండ్రాజు శివశంకర్‌రాజు కూలిన షెడ్డును పరిశీలించారు.

15 నిమిషాల పాటు వడగళ్ల వాన

తిరుపతి నగర ప్రజలు వడగళ్ల వానను చూసి చాలా ఏళ్లు అయింది. కుండపోత వర్షంలో 15 నిమిషాల పాటు వడగళ్లు పడ్డాయి. టప టపమనే శబ్దంతో వచ్చిన ఈ వడగళ్ల వానతో జనం బెంబేలెత్తిపోయారు.



నాగలాపురం మండలం రాజులకండ్రిగలో పడిన వడగండ్లు

ఈదురుగాలుల ధాటికి

జోరు వానకు ఈదురు గాలులు తోడవడంతో బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో వృక్షాలు నేల కొరిగాయి. భారీ వృక్షాలు సైతం గాలి దాటికి పడిపోవడంతో ప్రజా రవాణాకు ఆటంకం ఏర్పడింది. కూలిపోయిన వృక్షాలను మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం శరవేగంగా తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలు, కార్లపై చెట్టుకొమ్మలు విరిగి పడిపోవడంతో ధ్వంసం అయ్యాయి. శివ జ్యోతి నగర్, హరే కృష్ణ రోడ్, మహిళా యూనివర్సిటీ, ఎస్వీ యూనివర్సిటీ రోడ్లు, తిమ్మనాయుడుపాలెం, కపిల తీర్థం రోడ్డు తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. సాయినగర్, లింగేశ్వర్‌నగర్ , అవిలాలలో చెట్లు, రేకుల షెడ్లు నేలకొరిగిపోయాయి.

పిడుగుపాటుకు నలుగురు బలి

జిల్లాను పిడుగుపాటు కుదిపేసింది. వేర్వేరుచోట్ల పిడుగులు పడి నలుగురు దుర్మరణం చెందారు.

గొర్రెలు మేపుతుండగా వ్యక్తి..

రాపూరు: మండలంలోని రావిగుంటపల్లికి చెందన తాటిబోయిన చిన్నయ్య (35) పిడుగు పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చిన్నయ్య పొలాల్లో గొర్రెలు మేపుతుండగా ఒక్కసారిగా పిడుగు పడడంతో కుప్పకూలిపోయాడు. 108 వాహనం వచ్చేలోపు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.



మృతి చెందిన చిన్నయ్య

తాటికాయల కోసం వెళ్లిన బాలుడు..

ఓజిలి : ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలో పిడుగు పడి మారుబోయిన కార్తీక్(10) అనే బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఓజిలి మండలం గొల్లపాలెం గ్రామంలో ఆదివా రం చోటు చేసుకుంది. గ్రామాని కి చెందిన మారుబోయిన ప్రదీప్, రేవతి దంపతులకు ఇద్దరు సంతానం. మొదటివా డు కార్తీక్. నాయుడుపేట పట్టణం బేరిపేటలో నివాసం ఉంటున్నారు. వేసవి సెలవులు ప్రకటించడంతో కుటుంబమంతా గొల్లపాలెం వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం తాటికాయల కోసం తోటి పిల్లలతో కలసి గ్రామ సమీపంలోకి వెళ్లగా అక్కడ వర్షంలోనే ఇంటికి నడిచి వస్తుండగా పిడుగుపాటుకు గురై కార్తీక్ అక్కడిక్కడే మృతి చెందాడు.

పొలం పనిచేస్తుండగా రైతు..

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని వద్దిగుంట కండ్రిగ గ్రామ సమీప పొలాల్లో పనిచేస్తున్న రైతు భాస్కర్ (53) పిడుగు దాటికి ఆదివారం మృత్యువాత పడ్డారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లగా చెట్టుపై పిడుగు పడడంతో భాస్కర్ అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు.



రైతు భాస్కర్ మృతదేహం

బాతుల కాపరి మృతి

చిల్లకూరు మండలం, కాకువారిపాళెం వద్ద పిడుగు పడి బాతుల కాపరి మునీంద్ర(40) మృతిచెందాడు. వాకాడు మండలం, బాలిరెడ్డిపాళెంకు చెందిన ఇతను బాతులు మేపుకునేందుకు వచ్చినట్టు స్థానికులు తెలిపారు.



మృతి చెందిన మునీంద్ర

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాలీవాన బీభత్సం సృష్టించడంతో తిరుపతి నగర పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రెండు గంటల తర్వాత గాలి తీవ్రత తగ్గుముఖం పట్టడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



సాయినగర్‌లో కూలిన భారీ వృక్షం



బొమ్మల క్వార్టర్స్‌లో కూలిన షెడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత శివశంకర్‌రాజు



చిల్లకూరు మండలం బల్లవోలులో తడిసిన ధాన్యం రాసులు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారన్నారు. అలాగే 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877-2227208కు ఫోన్ చేసి మాట్లాడవచ్చన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 84113 మంది స్వామివారిని దర్శించుకోగా 33,868 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.12 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్.. పూరిల్లు దగ్ధం

- రూ.5 లక్షలఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిల్లకూరు : మండలంలోని బల్లవోలులో ఓ పూరిల్లు విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆదివారం బాధితుడు నాగభూషణం వాపోయాడు. బల్లవోలు దళితవాడకు చెందిన నాగభూషణం కుటుంబ సభ్యులతో కలసి మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో ఫ్యాన్ నుంచి మంటలు ఏర్పడి ఒక్కసారిగా ఇంటి పైకప్పునకు అంటుకుంది. అగ్నిమాక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించేలోగా ఇంటిలోని సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతి అయ్యాయి. ఇంటిలో వస్తువులతో పాటుగా ఇటీవల ధాన్యం విక్రయించిన సొమ్ము కూడా ఉందని నగదుతో పాటుగా చిన్నపాటి బంగారు వస్తువులు కాలిపోయి సుమారు రూ. 5 లక్షల వరకు నష్ట పోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

కారులో నుంచి పడి మహిళకు గాయాలు

తిరుమల : ప్రమాదవశాత్తు కారులో నుంచి పడి మహిళకు గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తిరుమలలో పనిచేసే ఓ మహిళ విధుల నిమిత్తం కారులో తిరుమలకు బయలుదేరింది. వీరి కారు జీఎన్సీ టోల్‌గేటుకు సమీపంలో వస్తుందనగా మలుపు వద్ద కారు డోరు ఓపెన్ అయి మహిళ రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆమె ముఖానికి గాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న తిరుమల ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళను తితిదే అశ్విని ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి పంపారు. ప్రమాదవశాత్తు మహిళ కారులో నుంచి పడిపోయినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



మంగళం తిరుమలనగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్‌లో తుడా ఏర్పాటు చేసిన ఉద్యాన వనం

పట్టించుకోని తుడా అధికారులు

తిరుమలనగర్ పంచాయతీ తుడా క్వార్టర్స్‌లో స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిపెట్టేందుకు రూ.లక్షలతో ఏర్పాటు చేసిన ఉద్యానవనాన్ని తుడా అధికారులు పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. దీంతో తుడా నిధులు బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారింది. ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశాక దానిని నిత్యం పర్యవేక్షిస్తూ నిర్వహణ చూసుకోవాల్సి అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ఉద్యానవనంలోని చెట్లు ఎండిపోయి మరుభూమిగా మారింది. తుడా అధికారుల నిర్లక్ష్య ధోరణిపై తిరుమలనగర్ పంచాయతీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆహ్లాదమా నీవెక్కడ?

- అలంకారప్రాయంగా తుడా ఉద్యానవనం
- తుడా నిర్వహణ లోపంతో అధ్వాన్నంగా పార్కు
- మందుబాబులకు అడ్డాగా పార్కు
- ఆహ్లాదం, ఆరోగ్యానికి దూరంగా తిరుమలనగర్ ప్రజలు
- రూ.లక్షలు ఖర్చు చేసినా పట్టించుకోని అధికారులు

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ బిజీ లైఫ్ గడుపుతున్నారు. పైగా ఒత్తిళ్లతో కూడిన ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువులు ఒకటేమిటి అన్నింటా ఒత్తిడితో అందరూ చిత్తయిపోతున్నారు. వీకెండ్‌లో ఒత్తిడిని దూరం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సరదాగా గడపాలని కోరుకుంటారు..కానీ అందుబాటులో ఉన్న పార్కులు అధ్వాన్నంగా మారితే ..ఇది ప్రజలకు మరింత చికాకు..అసంతృప్తి , ఆవేశానికి దారితీస్తుంది. ఇదేకోవలోనే గత ప్రభుత్వంలో రూ.లక్షలు వెచ్చించిన తిరుమలనగర్ తుడా పార్కు నిర్వహణ లేక అధ్వాన్నంగా మారడంతో ఆందోళనకు గురిచేస్తోంది.

తిరుపతి మంగళం : ప్రతి మనిషికి ఆహ్లాదకర వాతావరణం..వ్యాయామం ఎంతో ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాయి. రాత్రింభవళ్లు శ్రమించి కాసేపు ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరితే ఆ రోజు చేసిన కష్టాన్నంతా మరిచిపోతాం. ఈ నేపథ్యంలోనే మంగళం పరిధి తిరుమలనగర్ పంచాయతీలోని తుడా క్వార్టర్స్‌లో పంచాయతీ ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం పంచాలనే ఆలోచనతో గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సుమారు రూ.32 లక్షలు ఖర్చు పెట్టి ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం స్థానిక ప్రజలు ఎంతో ఉల్లాసంగా ..ఆనందంగా సేద తీరేవారు. ప్రస్తుతం పార్కు నిర్వహణ గాడి తప్పింది.

నిర్వహణ పట్టించుకోకపోవడం

ఉద్యానవన నిర్వహణ చూసుకుంటూ అక్కడ పచ్చని మొక్కలను పెంచాల్సిన తుడా అధికారుల నిర్వహణ లోపం స్థానిక ప్రజలకు శాపంగా మారింది. రూ.లక్షలు ఖర్చు చేసిన ఉద్యాన వనాన్ని తుడా గాలికి వదిలేసింది. దీంతో ఉద్యానవనం కాస్త మందుబాబులకు, గంజాయి, మత్తుపదార్థాలు సేవించే వారికి అడ్డాగా మారింది.

మందుబాబులకు అడ్డాగా పార్కు

చంద్రగిరి నియోజకవర్గం మంగళం తిరుమలనగర్ పంచాయతీలోని తుడా క్వార్టర్స్‌లో మూడేళ్ల కిందట తుడా ఆధ్వర్యంలో అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆహ్లాదకరమైన ఉద్యానవనం ఏర్పాటు చేశారు. తుడా హెచ్‌ఐజీ వెంచర్ పరిధిలో గతంలోనే పార్కు కోసం కేటాయించిన సుమారు ఎకరా పరిధిలో చుట్టూ ప్రహరీ నిర్మాణంతో పచ్చటి చెట్లను నాటి బోరు మోటారు పెట్టి స్థానిక ప్రజలు సేద తీరడానికి రాతి బల్లలు , అందమైన రోడ్లు వేసి మిరుమిట్లు గొలిపేలా సెంటర్‌లైట్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో వాకింగ్ ట్రాక్స్, జిమ్ పరికరాలను ఏర్పాటు చేసి అందమైన ఉద్యానవనాన్ని అక్కడి ప్రజలకు అందించారు. అయితే పట్టుమని పదిరోజులు కూడా పార్కును నిర్వహించకుండా తుడా గాలికి వదిలేసింది. కనీసం పార్కు నిర్వహణను పంచాయతీ పాలకులకు కూడా అప్పజెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పిచ్చి మొక్కలు, ఎండిన ముళ్లపొదలతో పార్కు కళావిహీనంగా మారిపోయింది. తుడా నిర్లక్ష్యంగా వదిలేసింది. దీంతో మందుబాబులకు అడ్డాగా మారింది. వారి ఆగడాలకు స్థానికుల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తుడా అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ఆహ్లాదాన్ని పంచకపోగా వారి పాలిట శాపంగా మారింది.

ఆహ్లాదం, ఆరోగ్యానికి దూరంగా తిరుమలనగర్ పంచాయతీ ప్రజలు

మంగళంలోని తిరుమలనగర్ పంచాయతీ ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యాన్ని అందించాలనే మంచి ఆలోచన, ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తుడా క్వార్టర్స్‌లో సుమారు రూ. 32 లక్షలు ఖర్చు చేసి ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. అందమైన పూల మొక్కలు, పచ్చటి చెట్లు, ప్రజలు సేదతీరడానికి రాతి బెంచీలు, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేందుకు వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలను అందుబాటులో ఉంచారు. ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే తుడా అధికారుల నిర్వహణ సరిగ్గా లేక పచ్చదనాన్ని పంచాల్సిన ఉద్యానవనం పిచ్చిమొక్కలతో వెలవెలబోయింది. ఉద్యానవనం నిర్వహణ గాలికి వదిలేసిన తుడా అధికారులపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఉద్యావన నిర్వహణ తుడాకు చేతకాకపోతే పంచాయతీకి అప్పగించవచ్చు కదా అని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పిచ్చిమొక్కల మధ్య తుప్పపట్టి నిరుపయోగంగా జిమ్ పరికరాలు



ఉద్యానవనంలో మందుబాబులు తాగి పడేసిన మందు బాటిళ్లు



ఉద్యానవనంలో ఎండిపోయిన పిచ్చిమొక్కలు ఇలా..

ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష

- 67.95 శాతం హాజరు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని, 67.95 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు తెలిపారు. తిరుపతి నగరంలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పరీక్షలు రాసే అభ్యర్థులు అస్వస్థకు గురైతే తక్షణం వైద్య సేవలు అందించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లాలో ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్స్‌కు 911 మంది దరఖాస్తు చేసుకున్నారని, 619 (67.95 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారైనట్టు తెలిపారు. 292 మంది గైర్హాజరయ్యారని తెలియజేశారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



చంద్రయ్య(ఫైల్)

దొరవారిసత్రం : పోలిరెడ్డిపాళెం రైల్వే స్టేషన్‌కు సమీపంలో రైలు పట్టాలు దాటుతున్న వృద్ధుడు చంద్రయ్య(65)ను ఆదివారం రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. స్థానికులు, జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలు... మావిళ్లపాడు గ్రామానికి చెందిన చంద్రయ్య పొలం పనులు చూసుకునేందుకు రైలు పట్టాలు దాటుతున్న సమయంలో చెన్నై నుంచి నెల్లూరు వైపునకు వెళ్లే రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో చందయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు జీఆర్పీ ఎస్సై చెన్నకేశవ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ పరీక్ష సెంటర్ల మార్పుతో అవస్థలు



పరీక్షా కేంద్రాల విషయంలో కన్‌ఫ్యూజన్‌కు గురైన విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ అధికారుల తీరుతో డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు అవస్థలు తప్పడం లేదు. దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన నీట్ కోసం డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. డిగ్రీ పరీక్షల సెంటర్లు ఆయా కళాశాలలో ఏర్పాటుచేసినట్టు హాల్ టికెట్లలో ఉంది. అధికారులు మాత్రం నీట్ జరుగుతున్న కేంద్రాల్లో సెంటర్లు ఉన్న డిగ్రీ విద్యార్థులకు పక్కనున్న జూనియర్ కళాశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ముందుగా తెలియజేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అక్కడే విధి నిర్వహణలో ఉన్న పోలీసులు విద్యార్థులను సంబంధిత పరీక్షా కేంద్రాలకు తమ వాహనాల్లో తరలించారు.



మార్పు చేసిన డిగ్రీ పరీక్షా కేంద్రాలకు విద్యార్థులను తమ వాహనంలో తీసుకెళ్తున్న పోలీసులు

మైనర్లే.. మహాముదుర్లే!

తిరుపతి క్రైమ్: వారంతా మైనర్లే..పదిమంది లోపు ఉన్న వీరంతా పదిహేను ఏళ్ల లోపు ఏళ్లవారే. అర్ధరాత్రి దాటితే పిల్ల చెడ్డీగ్యాంగ్ లెవెల్లో వీధుల్లో హల్‌చల్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం వీరి సర దా. స్థానిక ఎస్టీవీనగర్, బైరాగిపట్టెడలోని మాతమ్మగుడి వీధి నుంచి ఆ చివర గంగమ్మ గుడి వరకూ ఉన్న వీధుల్లో ఈ పిల్ల గ్యాంగ్ ఆకతాయి చేష్టలు శ్రుతిమించుతున్నాయి. ఎవరైనా ఒంటరిగా వెళ్తుంటే ము సుగేసుకున్నట్టు తలపైవరకు చొక్కా లాక్కుని, వికృతంగా అరుస్తూ వారిని భయపెట్టడం, ద్విచక్రవాహనాల్లో వెళ్తున్న వారినీ ఇలాగే హడలెత్తించడం..ఎవరైనా ఆగి నిలదీస్తే వెకిలి చేష్టలు చేస్తూ, వారిని బండబూతులు తిడుతూ సందుగొందుల్లో పారిపోవడం, కొన్ని సందర్భాల్లో రాళ్లు విసరడం లాంటివీ చేస్తున్నారు. మాతమ్మ గుడి వీధిలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ కుటుంబాన్ని ఇటీవల ఈ పిల్ల గ్యాంగ్ హడలెత్తించింది. నిద్రిస్తున్న వాచ్‌మన్ కుటుంబం మీదకుగా ఖాళీ మద్యం బాటిల్ విసిరి పరుగులు తీసింది. ఆ బాటిల్ పెద్దపెట్టున శబ్దంతో ముక్కలై వారిమీద పడడంతో హడలిపోయి లేచారు. అదే వారు విసిరిన ధాటికి బాటిల్ తలకు తగిలి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. అంతకుముందు గ్యాస్ సిలిండర్‌ను ఈ పిల్ల గ్యాంగ్ ఎత్తుకుపోయే ప్రయత్నం చేసిందని, తాము ఆ చప్పుడుకు లేచి కేకలు వేసేసరికి పారిపోయారని వాచ్‌మన్ కుటుంబం తెలిపింది. వీరి వల్ల ఆ ప్రాంతంలో ప్రశాంతత కరువైంది. ఇక, ఈ గ్యాంగ్‌కు లీడర్‌గా వ్యవహరిస్తున్న మైనర్ గంగమ్మ గుడి ప్రాంతంలో ఉంటున్న ఓ కారుడ్రైవర్ కొడుకు అని తెలిసింది. ఈ మైనర్లను పోలీసులు సరైన దారిలో పెట్టాల్సిన అవసరం ఉంది.

గ్రామ కంఠం భూమి కబ్జా ..!

- ఏళ్ల తరబడి గ్రామకంఠంగా ఉన్న భూమి
- కొన్నేళ్లుగా పీర్ల పండుగను జరుపుకుంటున్న వైనం
- కూటమి ప్రభుత్వంలో యథేచ్ఛగా ఆక్రమణ
- తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే..!
- ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోని రెవెన్యూ అధికారులు



తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన షెడ్డు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. విలువైన ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. చంద్రగిరి పట్టణంలో విలువైన ప్రభుత్వ భూమిని ఓ మైనార్టీ నేత ఆక్రమించుకుని గుట్టు చప్పుడు కాకుండా షెడ్డు నిర్మించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చంద్రగిరి లెక్కదాఖలా సర్వే నంబరు 61/3లో కొంత మేర గ్రామకంఠం భూమి ఉంది. ఆ భూమిలో కొన్నేళ్లుగా ముస్లింలు పీర్ల పండుగను నిర్వహించుకుంటున్నారు. మిగిలిన సందర్భంగా భూమి ఖాళీగా ఉంది. ప్రస్తుతం దాని విలువ రూ.50 లక్షలకు పైగా ఉంది. దీనిపై అధికార పార్టీకి చెందిన ఓ మైనార్టీ నేత కన్ను పడింది. ఇటీవల వరుస సెలవులు రావడంతో శరవేగంగా అక్రమంగా షెడ్డును నిర్మించాడు. తరతరాలుగా పీర్లచావిడిగా వినియోగించుకుటున్న భూమిని ఆక్రమించుకోవడంపై ముస్లిం పెద్దలు మండిపడుతున్నారు. 2022లో కూడా ఈ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి అతను యత్నించాడని, అప్పట్లో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారని పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అతను ఆక్రమించుకున్నాడని వాపోతున్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే ఆక్రమణ

తహసీల్దార్ కార్యాలయానికి 100 మీటర్ల దూరంలో ఈ ఆక్రమణ జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ముస్లింలు, స్థానికులు మండిపడుతున్నారు. అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నట్టు రెండు వారాల క్రితం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెబుతున్నారు. దీనిపై వీఆర్‌వో పురుషోత్తంను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై నిల్చొని చెట్టు కొమ్మలు తొలగిస్తున్న జూనియర్ లైన్‌మన్ మురళి



విద్యుత్ షాక్‌తో ట్రాన్స్‌ఫార్మర్‌పైనే కుప్పకూలిన మురళి

- విద్యుత్ షాక్‌కు గురైన లైన్‌మన్

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీ పరిధిలోని సంస్కృతి నగర్‌లో ఆదివారం సాయంత్రం పెనుగాలులకు చెట్టుకొమ్మలు విరిగి విద్యుత్తు తీగలపై పడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. స్థానికుల సమాచారం మేరకు విద్యుత్తు శాఖలో జూనియర్ లైన్స్‌మన్‌గా పనిచేస్తున్న మురళి అక్కడకు చేరుకుని విద్యుత్తు సబ్ స్టేషన్ నుంచి లైన్ ఆఫ్ చేసుకుని చెట్టు కొమ్మలు తొలగించే పనులు చేపట్టాడు. ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఆఫ్ చేసుకుని దానిపై నిలుచుని చెట్టు కొమ్మలు తీస్తుండగా హఠాత్తుగా కరెంటు సరఫరా కావడంతో షాక్‌కు గురై ట్రాన్స్‌ఫార్మర్‌పైనే కుప్పకూలిపోయాడు. స్థానికులు అరవడంతో అతడితో పాటు వచ్చిన విద్యుత్తు సిబ్బంది సబ్ స్టేషన్‌కు సమాచారం అందించి ఆ ప్రాంతంలో మొత్తం సరఫరా నిలిపివేయించారు. అనంతరం లైన్‌మన్‌ను కిందకు దించి చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.



కాలిన గాయాలతో ఉన్న మురళిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

నీట్..ప్రశాంతం

- తిరుపతిలో 9, గూడూరులో 1 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ
- 97.48 శాతం మంది హాజరు
- 112 మంది పరీక్షలకు గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం తిరుపతిలో 9, గూడూరులో 1, మొత్తం పది పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన నీట్ ప్రశాంతంగా జరిగింది. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నీట్ ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 4,445 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 112 మంది గైర్హాజరవ్వడంతో 4,333 (97.48శాతం) మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. నీట్ రాసేందుకు ఉదయం 11గంటల నుంచే విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వీరిని నిబంధనలకు అనుగుణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.

తల్లిదండ్రుల ఆందోళన

నీట్ పరీక్షా కేంద్రంలోకి ఉదయం 11 గంటల నుంచి అనుమతించాలని ఎన్‌టీఏ నిబంధనల్లో పేర్కొంది.అయితే తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఉదయం 11.30 గంటలు అయినా లోపలికి అనుమతించలేదు. దీంతో అక్కడే ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. అక్కడే ఉన్న అధికారులు, పోలీస్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో 11.40 గంటలకు విద్యార్థులను లోపలికి అనుమతించారు.

గందరగోళం

ఆలస్యంగా అనుమతించిన నేపథ్యంలో విద్యార్థులను సక్రమంగా తనిఖీ చేపట్టకుండా అనుమతించేశారు. లోపల వారి అడ్మిట్ కార్డులను పరిశీలించిన అధికారులు శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ పరీక్షా కేంద్రంలో పరీక్ష రాయాల్సిన కొందరి విద్యార్థులను గుర్తించి వారిని పంపించేశారు. అప్పటికే సమయం మించి పోతుండడంతో పోలీస్ సిబ్బంది వారిని తమ ద్విచక్ర వాహనాలపై మహిళా యూనివర్సిటీ పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లి దిగబెట్టారు.



చెవి కమ్మలు తీసేస్తున్న విద్యార్థిని

పరీక్షను మళ్లీ నిర్వహించాలి

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల కేంద్రంలో నిర్వహించిన నీట్‌ను తిరిగి నిర్వహించాలంటూ తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పరీక్షా కేంద్రంలో కనీసం గోడ గడియారం కూడా లేకపోవడంతో ఎంత సమయం అయిందో తెలియక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని వాపోయారు. 11 గంటల నుంచే అనుమతించాల్సి ఉన్నప్పటికీ ఆ కళాశాల ప్రిన్సిపల్ అనుమతించలేదని, దీంతో తాము ఆందోళన చేపట్టడంతో 11.40 గంటలకు అనుమతించారని వాపోయారు. పరీక్ష ప్రారంభానికి ముందే అటెండెన్స్‌కు సంబంధించిన అన్ని వ్యవహారాలను పూర్తి చేయాల్సి ఉందని, అయితే పరీక్షా నిర్వహణాధికారుల అవగాహన రాహిత్యం వలన పరీక్ష ప్రారంభమయ్యాక జవాబు పత్రాలపై ఫొటోలు అంటించడం, వేలిముద్రలు వేయడం, సంతకాలు తీసుకోవడం వంటి పనులతో విద్యార్థుల విలువైన సమయాన్ని కోల్పోయారని, ఇన్విజిలేటర్ల అలసత్వం విద్యార్థులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్ష నిర్వహణాధికారుల అలసత్వం, ఆ కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై కలెక్టర్ దృష్టి సారించి వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.



శ్రీపద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద బారులు తీరిన నీట్ విద్యార్థులు